కూటమి ఏడిపింఛేన్

ఏళ్ల కాలంగా పొందుతున్న వికలాంగ పెన్షన్లను కూటమి ప్రభుత్వం తొలగించడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. బాధితులు తమను ప్రభుత్వం వీధిన పడేసిందని శాపనార్థాలు పెడుతున్నారు. ఈ ప్రభుత్వం మాకొద్దని దుమ్మెత్తి పోస్తున్నారు.


ఆటోలో కూర్చుని తన గోడు నివేదిస్తున్న కుమారి

బాలాయపల్లి(సైదాపురం): పుట్టుకతో వికలాంగురాలైన తనకు 15 ఏళ్ల నుంచి వస్తున్న పింఛన్‌ను కూటమి ప్రభుత్వం తొలగించి కడుపు కొట్టిందని గురువారం బాలాయపల్లె మండల పరిషత్ కార్యాలయం వద్ద గొట్టికాడు గ్రామానికి చెందిన గున్నం కుమారి కన్నీటి పర్యంతమైంది. తాను నడవలేనని, తనకు వైకల్యం వంద శాతం ఉన్నట్టు సదరన్ సర్టిఫికెట్ ధ్రువీకరించినప్పటికీ పింఛన తొలగించడం శోచనీయమని తన ఆక్రోశం వెళ్లగక్కింది. గొట్టికాడు నుంచి బాలాయపల్లెకు ఆటో బాడుగరూ. 500 పెట్టుకుని రావాల్సిన పరిస్థితి కలిగిందని వాపోయింది. ప్రభుత్వం ఇస్తున్న పింఛనే తనకు జీవనాధారమని, అధికారులు తనకు వికలాంగ పింఛను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది.

బధిరురాలైనా కడుపు కొట్టారు



ఇక్కడ కనిపిస్తున్న వ్యక్తి పేరు కాలిచపిడి లక్ష్మి. చీపినాపి గ్రామం. పుట్టుకతోనే బధిరురాలు. సదరన్ సర్టిఫికెట్‌లో 80శాతం వైకల్యం అని ఉండిజ తాగాజా ఇటీవల అధికారులు రీ-వెరిఫికేషన్‌లో 40శాతం కంటే తక్కువ వేయడంతో పింఛన్‌ను నిలిపివేస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. పింఛన్‌ను నమ్ముకుని జీవించే తమలాంటి వారి కడుపు కొట్టడం సరికాదని వాపోతోంది.

నిర్దాక్షిణ్యంగా తొలగించారు



కలువాయి(సైదాపురం): చిత్రంలో మంచంపై పడుకుని ఉన్న వ్యక్తి పేరు మల్లు పెంచలరెడ్డి. కలువాయి గ్రామం. పుట్టుకతోనే పోలియో బాధితుడు. 20 ఏళ్లుగా వికలాంగ పింఛన్ పొందుతున్నాడు. అయితే పెంచలరెడ్డికి పింఛన్‌ను తొలగిస్తున్నట్లు అధికారులు నోటీసులు జారీ చేయడంతో హతాశుడయ్యాడు. పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న తనకు నిర్దాక్షిణ్యంగా పింఛను తొలగించడంతో దిక్కు తోచడం లేదని, అధికారులు పునరుద్ధరించాలని ప్రాధేయపడుతున్నాడు.

పింఛన్లు తొలగించడం దుర్మార్గం



పేదలకు అండగా ఉంటాం... దివ్యాంగులను ఆదుకుంటామని ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పిన మాటలన్నీ నీటిమూటలుగా మారాయి. పింఛన్లు తొలగించి దివ్యాంగుల కడుపు కొట్టారు. ఏళ్లకాలంగా పింఛన్లు పొందుతున్న వారిపై అనర్హత వేటు వేసి తొలగించడం దుర్మార్గం. పెళ్లకూరు మండలంలో 213మంది పింఛన్లు తొలగించారు. వారి ఉసురు కూటమి ప్రభుత్వానికి తగలకమానదు.

-సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెళ్లకూరు

ఆర్టీసీ డిపో మేనేజర్ తీరుపై నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

చిల్లకూరు: గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కార్మికులపై మొండి వైఖరి అనుసరిస్తున్నారని నిరసిస్తూ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు గురువారం గూడూరు డిపో ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్స్‌తో డీఎం వెంకటేశ్వర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎవరైనా చిన్నపాటి పొరపాటు చేస్తే..ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని గతంలో అధికారులు సూచించేవారని, అయితే దీనికి భిన్నంగా ప్రస్తుత డీఎం తీరు ఉంటోందన్నారు. ఇటీవల కండక్టర్ శ్రావణకుమార్ చిన్న పొరపాటు చేస్తే అతనిని సస్పెండ్ చేయడం శోచనీయమని, సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. డీఎం ఇలాగే వ్యవహరిస్తే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రీజినల్ వైస్ ప్రెసిడెంట్ వెంకయ్య, డిపో అధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి గౌస్, కమలాకర్, కరీముల్లా, వెంకటేశ్వర్లు, సంధాని, బాబు, రమేష్, సుధాకర్, శేఖర్ పాల్గొన్నారు.

వికలాంగుని పింఛన్ పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..


బాధితునికి పింఛన్‌ను పునరుద్ధరిస్తున్న సచివాలయ సిబ్బంది

కలువాయి(సైదాపురం): మండలం కేంద్రమైన కలువాయిలోని కనకమహల్ వీధికి చెందినమద్దులూరి నాగరాజుకు పింఛన్ పునరుద్ధరించారు. ఈనెల 20న సాక్షి దినపత్రికలో 'పింఛన్ల కకావికలం' శీర్షికతో ప్రచురించిన కథనంపై నెల్లూరు కలెక్టర్ ఓ ఆనంద్ స్పందించారు. కలెక్టర్, డీఎంహెచ్ఓ సుజాత ఆదేశాలతో కుల్లూరు వైద్యాధికారి అన్వర్ బాషా హుటాహుటిన కలువాయి సచివాలయం-2కు వికలాంగుడైన నాగరాజును రప్పించారు. నిలుపుదల చేసిన పింఛన్‌ను పునరుద్ధరించినట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి


వినాకస్వామి విగ్రహాలను పరిశీలిస్తున్న సీఐ రమణ

వెంకటగిరి రూరల్: వినాయక చవితి ఉత్సవాల నిర్వాహణకు ముందస్తుగా పోలీసు అనుమతి విధిగా పొందాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ స్పష్టం చేశారు. పట్టణంలోని వినాయస్వామి విగ్రహాల తయారీ ప్రాంతాలను గురువారం సీఐ పరిశీలించిన అనంతరం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. 27వ తేదీ వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో వినాయక ప్రతిమలు ప్రతిష్ఠించే ప్రదేశాల వివరాలు తెలిపారు. కమిటీ సభ్యులు, నిర్వాహకులు రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి సాంస్కృతిక, డీజే వంటి కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. వినాయక మండపాల వద్ద విలువైన వస్తువులు ఉన్నట్లైతే వాటిపై కమిటీ సభ్యులు నిఘా ఉంచి, తమ దృష్టికి తేవాలన్నారు.

పీఏసీఎస్ సభ్యుల ప్రమాణ స్వీకారం


-సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

కలువాయి(సైదాపురం): కలువాయి పరమేశ్వరి కల్యాణ మండపంలో కలువాయి ప్రాథమిక సహకార సమితి అధ్యక్షులు, సభ్యులు ప్రమాణ స్వీకారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడిగా చౌటపల్లెకు చెందిన జగదల్ నాయుడు, సభ్యులుగా గ్రంధి సురేష్ (కలువాయి), నాలి పెంచలయ్య (ఉయ్యాలపల్లె) ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి సహకార సమితి కృషి చేయాలని మార్గదర్శనం చేశారు.

కలువాయి హైస్కూల్‌లో టీచర్లను నియమించరూ!

బీవీఎస్ఆర్ జెడ్పీహైస్కూల్‌లో ప్లస్-1, ప్లస్2 కు ఉపాధ్యాయులు కొరత ఉందని ఎమ్మెల్యే రామకృష్ణ దృష్టికి విద్యార్థినులు సమస్యలు నివేదించారు. వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ప్రాథమిక సహకార సమితి చైర్మన్ మెట్టుకూరు ధనంజయ్యరెడ్డి, బీజేపీ, జనసేన నేతలు ఎస్ఎస్ఆర్ నాయుడు, తోట కృష్ణయ్య, కలువాయి మండల టీడీపీ నేతలు వెంకటేశ్వరనాయుడు, గడ్డం కిషోర్‌రెడ్డి, రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భవనం ప్రారంభం

డక్కిలి: మండలంలోని మాధవయ్యపాళెం సొసైటీకి సంబంధించి కమ్మపల్లెలో కొత్తగా నిర్మించిన భవనాన్ని గురువారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టకూరు ధనంజయ్యరెడ్డి ప్రారంభించారు. నూతన భవనంలో గోడౌన్, కార్యాలయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాధవయ్యపాళెం సొసైటీ అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, ఎంపీపీ రాజశేఖర్, మండల ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖరరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు పీ.కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భోజన నిర్వాహకులపై కూటమి నేతల అక్కసు


గోడ అవతల పార వేసిన వంట పాత్రలు

చిల్లకూరు: మండలంలోని వల్లిపేడు జెడ్పీ హైస్కూలులో పిల్లలకు మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళపై కూటమి నాయకులు అక్కసు పెంచుకుని వంట పాత్రలను గోడ అవతలికి విసిరి వేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ సీపీ సానుభూతి పరులైన చిరుద్యోగులపై అక్కసు పెంచుకుని, వారిని ఆ పనిలో నుంచి తొలగించే వరకు నిద్ర పోవడం లేదు. ఇందులో భాగంగానే చిల్లకూరు మండలం వల్లిపేడు జెడ్పీహైస్కూలులో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలి భర్త వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి స్థానిక కూటమి నాయకులు తీసుకుని వెళ్లడంతో వెంటనే ఆమెను తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో స్థానిక నాయకులు పాఠశాలలోని పాఠశాల త్రీ మెన్ కమిటీతో తీర్మానం చేయించి దానిని విద్యాశాఖాధికారులకు పంపారు. వారు వంట చేస్తున్న మహిళను ఇకపై వంట చేయవద్దని ఆదేశించారు. దీంతో ఆమె ఈ విషయాన్ని తమ యూనియన్ దృష్టికి తీసుకెళ్లింది. దీంతో స్థానిక కూటమి నాయకులు ఈ విషయం పెద్దది అవుతుందని భావించి పోలీసులను రంగంలోకి దించి వంట చేసేందుకు వచ్చిన ఆమెను మహిళా సిబ్బంది ద్వారా పాఠశాలలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. అలాగే వంట పాత్రలను గోడ అవతల పారవేశారు. ఈ విషయమై ఎంఈఓ రవూఫ్‌ను వివరణ కోరగా ఉన్నత పాఠశాల విషయం అయినందున డిప్యూటీ డీఈఓ చూస్తున్నారని, అయినా త్రీ మెన్ కమిటీ తీర్మానంతోనే కొత్త నిర్వాహకులను నియమించడం జరిగిందన్నారు.

పంటల సాగుపై రైతులకు శిక్షణ

చిల్లకూరు: వరి, ఉద్యానవన పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని తిమ్మనగారిపాళెంలో రైతులకు నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం (తిరుపతి) వ్యవసాయాధికారి వేణుగోపాలరావు, ఉద్యానవన శాఖాధికారి సుమతి మాట్లాడారు. వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యత గురించి చెప్పారు. అన్నారు. మండలంలో ఎక్కువగా మెట్ట భూములు ఉన్నాయని, ఇవి నిమ్మ, మామిడి, సాగుకు అనుకూలమని, అలాగే వివిధ రకాల పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ గోపినాయక్, చిల్లకూరు ఏఓ గూడూరు భవాని, గ్రామ సర్పంచ్ గిద్దలూరు సుమలత, గ్రామ వ్యవసాయ సహాయకులు గాయత్రి, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


బాలిరెడ్డిపాళెంలో పరామర్శిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి


నివాళులు అర్పిస్తున్న సంజీవయ్య తదితరులు


వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెంకు చెందిన విశ్రాంత వీఆర్వో పొంగూరు కృష్ణమోహన్‌రెడ్డి, కల్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వాకాటి ప్రవీణ్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించి, చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు.

నాయుడుపేటలో కిలివేటి నివాళి

నాయుడుపేటటౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు చిల్లకూరు బాలకృష్ణా రెడ్డి తండ్రి సుబ్రహ్మణ్యం రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం ఆయన భౌతిక కాయానికి సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కారును ఢీకొన్న లారీ

-విజయవాడ వాసులకు గాయాలు



నాయుడుపేట టౌన్: కారును లారీ ఢీకొనడంతో ఏడుగురు గాయపడిన సంఘటన గురువారం సాయంత్రం మండలంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం..విజయవాడ ప్రాంతానికి చెందిన కుటుంబరావు తన బంధువులతో కలిసి చెన్నై నుంచి తిరిగి స్వస్థలానికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. అయ్యప్పరెడ్డిపాళెం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై లారీ వేగంగా వచ్చి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు బాగా ధ్వంసమైంది. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు స్వల్పగాయాలతో బైటపడ్డారు. ప్రమాదం మూలాన జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రహదారి మధ్యలో నిలిచిపోయిన లారీ, దెబ్బతిన్న కారును క్రేన్ సాయంతో తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన


పింక్ బస్సు ముందు వైద్యులు, సిబ్బంది


డక్కిలిలో..

డక్కిలి/బాలాయపల్లె(సైదాపురం): తిరుపతి స్విమ్స్ వైద్య బృందం గురువారం డక్కిలి, బాలయపల్లె మండల కేంద్రాల్లో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరానికి మంచి స్పందన లభించింది. రెండు పింక్ బస్సుల్లో పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. అత్యవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డక్కిలిలో 93మంది, బాలాయపల్లెలో 75మందిని పరీక్షించారు. తొలుత క్యాన్సర్ వ్యాధిపై వైద్యులు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్సతో క్యాన్సర్ నుంచి విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడికలాఫీసర్ నాగరాజ్, నోడలాఫీసర్ టీవీడీ ప్రత్యూష, డాక్టర్ లలిత్, స్విమ్స్ వైద్యులు చైతన్యభాను, పద్మావతి స్థానిక వైద్యాధికారులు డాక్టర్ బిందుప్రియాంక, వెంకటరెడ్డి, లియోన, సీహెచ్‌ఓలు సుకుమారి, ఖలీద్‌బాషా, నీరజ, బాలాయపల్లె ఎంపీడీఓ వినిల్‌కుమార్, సూపర్‌వైజర్లు ఆదిలక్ష్మి, అనురాధ, రాజేశ్వరి, ఏఎన్ఎంలు తూపిరి మేరి, శైలజ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతపూజలు

సూళ్లూరుపేట: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు చేయనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బీ.ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, పట్టణంలోని మహిళలందరూ పాల్గొనాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

గిరిజన కుటుంబానికి ఐడీజేఎన్ సాయం


గిరిజన కుటుంబానికి సాయం అందిస్తున్న కిరణ్ తదితరులు

తడ: మండలంలోని గ్రద్దగుంట పంచాయతీ కాసింఖాన్ కండ్రిగ గిరిజన కాలనీలో అంతు చిక్కని వ్యాధితో బాధ పడుతున్న టి. సుధాకర్, శాంతి కుటుంబానికి సూళ్లూరుపేటకు చెందిన ఇంటర్నేషనల్ దళిత్ జర్నలిస్టు నెట్‌వర్క్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులతోపాటు కొంత నగదు అందజేశారు. ఈ కుటుంబానికి అవసరమైన వైద్యసేవలతోపాటు ఆర్థిక సాయం కూడా అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శరత్‌ను కోరారు. కార్యక్రమంలో గురవయ్య, ప్రసాద్, మునిరాజా, నవీన్, మహేష్, కిషోర్, రజని పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సమీక్ష


:సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఏపీడీ ౦౦౦

సైదాపురం: 'ఉపాధి' సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని నెల్లూరు జిల్లా డ్వామా అడిషనల్ పీడీ స్వరూప్ ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఉపాధి హామీ పథకం కింద ఉచితంగా నిమ్మ సాగుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, అర్హత కలిగిన రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి కింద పలు పనులు మంజూరు చేశామని, వాటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు


మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి

వెంకటగిరి రూరల్: రైతులు పంటల సాగులో సేంద్రియ ఎరువులు వాడితే ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి వేణుగోపాల్‌రావు అన్నారు. మండలంలోని యాతలూరులో గురువారం రైతులకు పీఎం ఆర్కేవీవై పథకంపై అవగాహన కల్పించారు. సేంద్రియ, జీవన ఎరువులు వాడితే భూమి ఆరోగ్యవంతంగా కూడా ఉంటుందని ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, వీఏఏ గురుబ్రహ్మం, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవిప్రసాద్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేశారని ఫిర్యాదు


స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట మండలం మన్నేముత్తేరిలో సర్వే నంబర్ 41-ఏలో ఓ మహిళ సెంటు ప్రభుత్వ భూమిని కబ్జా చేసిందని గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐ రాజగోపాల్ సిబ్బందితో కలసి ఆ స్థలాన్ని పరిశీలించారు. గత తహసీల్దార్ ఆమెకు 1.5 సెట్ల భూమి మంజూరు చేశారని, దానికి పొజిషన్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారని తేల్చారు. భూ సర్వే చేసి స్థలం ఆక్రమణ గురైందీ, లేనిదీ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

కండలేరులో 29.980 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 29.980టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8200క్యూసెక్కుల నీరు చేరుతోందని, కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1600, పిన్నేరు కాలువకు 30, లో లెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు 22-8-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	108
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	200
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	224
లేయర్ చికెన్	:	200

30న వేనాడు దర్గా గంధ మహోత్సవం

తడ: మండలంలో వేనాడులోని షేక్ దావూద్ షావలీ అల్లాహ్ దర్గా 30వ గంధ మహోత్సవం ఈ నెల 30న రాత్రి నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. గంధోత్సవంలో భాగంగా ఈ నెల 24న దర్గా వద్ద జెండా స్థాపన (నిసాన్) ఉంటుందని ముజావర్ ముష్తియార్ తెలిపారు.

భూసర్వేతో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

కోట: భూసర్వేతో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ జయజయరావు అన్నారు. గురువారం మండలంలోని చిట్టేడు, కేసవరం, మద్దాలిలో గ్రామసభలు నిర్వహించి భూముల వివరాలు సేకరించారు. ఆయా గ్రామాల్లో త్వరలో భూ సర్వే చేయనున్నామని, తొలుత క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే గ్రామసభలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మండల సర్వేయర్ గోపిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఐటీఐ ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కోట: చిట్టేడు బాలికల ఐటీఐ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి సంబంధించి మూడవ విడత అడ్మిషన్లకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి గురువారం తెలిపారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.19.38లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

చిల్లకూరు: మండల తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో గురువారం హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖాధికారులు లెక్కించారు. ఈఓ నవీన్‌కుమార్ మాట్లాడుతూ, ముత్యాలమ్మ ఆలయంతో పాటు పోలేరమ్మ ఆలయం హుండీల ద్వారా మొత్తం 19 ,38,902 రూపాయల ఆదాయం సమకూరిందని, దీనిని బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామన్నారు. కార్యక్రమంలో గూడూరు డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్, ఆలయ సిబ్బందితోపాటు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి చేపల పెంపకంపై శిక్షణ

చిట్టమూరు: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరులో కార్ప్ చేపల పెంపకంపై శుక్రవారం నుంచి మండలంలోని చేపల పెంపకందారులు, ఆక్వా రైతులకు వారం రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ విభాగ శాస్త్రవేత్త శ్రీహరి సాధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.లలిత శివజ్యోతి ఈ శిక్షణ ఇస్తారని, ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాల కోసం సెల్ నంబర్ 9154806577 సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

-వేతనాలు పెంచాలని డిమాండ్


నాయుడుపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద..

వాకాడు/నాయుడుపేటటౌన్: తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన బాట పట్టారు. గురువారం నాయుడుపేటలో, పెళ్లకూరు, ఓజిలి, నాయుడుపేట మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, వాకాడులో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా తీరును ఎండగట్టారు. తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రాజకీయ నాయకులు వేధింపులు లేకుండా చూడాలని, 5-జీ నెట్ వర్క్ ఉన్న సిమ్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ఉద్యోగోన్నతులకు మార్గదర్శకాలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, అంగన్‌వాడీ మహిళా నేతలు ఎస్.శ్యామల, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్ రోడ్డుకు నిధులు మంజూరు

కోట: విద్యానగర్ నుంచి గూడలి వరకు ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.1.80కోట్లు మంజూరైనట్లు ఆర్అండ్‌బీ డీఈఈ చంద్రశేఖరరెడ్డి గురువారం తెలిపారు. రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారడంతో ఈ నిధులు మంజూరయ్యాయి. విద్యానగర్ నుంచి ప్రకాశం కాలనీ వరకు సీసీ రోడ్డు, అక్కడ నుంచి గూడలి వరకు బీటీ రోడ్డు వేస్తామన్నారు.

కలువాయి ఆర్టీఓ దాడులు

కలువాయి(సైదాపురం): మండలంలో గురువారం ఆత్మకూరు ఆర్టీఓ రాములు వాహనాలపై దాడులు నిర్వహించారు. రెండు ఆటోలు, రెండు బైక్‌లను సీజ్ చేసి కలువాయి పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. వాహనాలకు రూ. 10 వేల అపరాధ రుసుం విధించారు.